ఈదురుగాలుల బీభత్సం ..

- ఎక్కడికక్కడ విరిగిపడిన విద్యుత్ స్తంభాలు
- నేలకొరిగిన అరటి, వరి పంటలు
- నిండా మునిగిన రైతన్న


దత్తిరాజేరు: దత్తి గ్రామంలో మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న ఏఓ అనురాధ


చీపురుపల్లి: వర్షాలకు దెబ్బతిన్న బొప్పాయి పంటను పరిశీలిస్తున్న ఉద్యానవనశాఖాధికారి అనూష

మెరకముడిదాం: జిల్లా వ్యాప్తంగా గురు, శుక్రవారాల్లో భారీ వర్షం కురిసింది. ఈదురుగాలులతో కూడిన వర్షం పడడంతో వివిధ రకాల పంటలకు నష్టం వాటిల్లింది. అలాగే విద్యుత్ స్తంభాలు నేలకొరగడంతో సరఫరా నిలిచిపోయి ప్రజలు ఇబ్బంది పడ్డారు. మెరకముడిదాం మండలంలోని కొత్తకర్ర, చినబంటుపల్లి, గర్భాం, తదితర గ్రామాల్లో సుమారు 50 వరకు విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. కొత్తకర్ర గ్రామంలో పూరింటిపై విద్యుత్ స్తంభం పడిపోయింది. అయితే ఆ సమయంలో సరఫరా లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. ఆయా గ్రామాల్లో విద్యుత్ సరఫరా లేకపోవడంతో నీటి సరఫరా నిలిచిపోయింది. విషయం తెలుసుకున్న సర్పంచ్ బూర్లె పార్వతి, వైఎస్సార్‌సీపీ యువ నాయకుడు బూర్లె సురేష్‌కుమార్ స్పందించి మూడు ట్యాంకర్లతో తాగునీరు సరఫరా చేశారు. విద్యుత్‌శాఖ ఎ.డి బీవీ రమణ, ఏఈ కె.దివాకర రావు, లైన్‌మన్లు వెంకటినాయుడు, చిన్నంనాయుడు, సూర్యనారాయణ, తదితరులు స్పందించి యుద్ధప్రాతిపదికన విరిగిపోయిన విద్యుత్ స్తంభాల స్థానంలో కొత్తవి ఏర్పాటు చేశారు. మండలంలోని శ్యామాయవలస, ఊటపల్లి, మెరకముడిదాం, ఉత్తరావల్లి, సోమలింగాపురం, ఎం.రావివలస, తదితర గ్రామాల్లో సుమారు 40 ఎకరాల్లో అరటి పంటకు నష్టం ఏర్పడింది.

కూలిన చెట్లు..

గుర్ల: మండలంలోని దేవునికనపాక, గవిడిపేటలో ఈదురుగాలులతో కురిసిన వర్షానికి రోడ్డు పక్కన ఉన్న చెట్లు విరిగిపడ్డాయి. విద్యుత్ స్తంభాలపై చెట్లు పడిపోవడంతో విద్యుత్ తీగలు తెగిపడ్డాయి. తహసీల్దార్ ఆదిలక్ష్మి శుక్రవారం ఆయా గ్రామాల్లో పర్యటించి నష్టాన్ని అంచనా వేశారు.

28 ఎకరాల్లో ఉద్యాన పంటలకు నష్టం..

చీపురుపల్లి: బంగాళాఖాతంలో ఏర్పడిన తుఫాన్ కారణంగా గురువారం తెల్లవారుఝామున 4 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది. ఈదురుగాలులు కూడా వీయడంతో మండలంలోని పలు గ్రామాల్లో ఉద్యాన పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. సుమారు 28 ఎకరాల్లో బొప్పాయి, అరటి పంటలు నాశనమైనట్లు ఉద్యానవన శాఖాధికారి ఎం.అనూష తెలిపారు. పీకే పాలవలస, గుణిదాం, గొల్లలపాలెం, పుర్రేయవలస, తదితర గ్రామాల్లో పంటలు నాశనమయ్యాయి. అలాగే చీపురుపల్లి పట్టణంలో పలు చోట చెట్లు నేలకొరిగాయి.

17 విద్యుత్ స్తంభాలు

దత్తిరాజేరు: మండల వ్యాప్తంగా 17 విద్యుత్ స్తంభాలు పడిపోయినట్లు కోమటిపల్లి సబ్‌స్టేషన్ జేఈ ఆదిత్య తెలిపారు. టి. బూర్జవలస, దత్తరాజేరు, పోరలి గ్రామాల్లో కూలిన స్తంభాల స్థానంలో శుక్రవారం సాయంత్రం నాటికి కొత్తవి వేసినట్లు చెప్పారు. అలాగే దత్తి, పెదమానాపురం, గుచ్చిమి, దత్తిరాజేరు, కోమటిపల్లి, పోరలి, తదతర గ్రామాల్లో మొక్కజొన్న, పత్తి పంటలు నాశనమయ్యాయి. ఏఓ అనురాధ, తదితరులు పడిపోయిన పంటలను శుక్రవారం పరిశీలించారు.

విద్యుత్‌శాఖకు నష్టం రూ.4.50 లక్షలు

శృంగవరపుకోట: వర్షాలకు పడిపోయిన విద్యుత్ స్తంభాలు, తెగిపోయిన తీగల వల్ల విద్యుత్ శాఖకు రూ.4.50 లక్షల నష్టం వచ్చినట్లు ఏడీఈ వెంకటరావు తెలిపారు. జామి మండలంలో లొట్లపల్లి, పావాడ, కిర్ల, కొత్తూరు, జామి గ్రామాల్లో ఒక్కో విద్యుత్ స్తంభం నేలకొరియగాయి. ఎస్.కోట మండలంలో గోపాలపల్లిలో - 3 భవానీనగర్-3, ఉసిరి-2, కాపుసోంపురం-1, అడ్డతీగ-1 మొత్తం 10 విద్యుత్ స్తంభాలు.. వేపాడ మండలంలో వల్లంపూడిలో-2, కె.జి.పూడి-4, పీకేఆర్ పురంలో ఒకటి చొప్పున మొత్తం 22 స్తంభాలు పడిపోయాయి. విద్యుత్ శాఖాధికారులు యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేపడుతున్నారు.


గుర్ల: గవిడిపేట రోడ్డుపై పడిన చెట్టు,


చీపురుపల్లి: మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో కూలిన చెట్టు


మెరకముడిదాం: కొత్తకర్ర గ్రామంలో పూరింటిపై ఒరిగిన విద్యుత్ స్తంభం


శృంగవరపుకోట: గాలుల తాకిడికి కూలిన విద్యుత్ స్తంభం


మెరకముడిదాం: కొత్తకర్ర గ్రామంలో పడిపోయిన విద్యుత్ స్తంభం


దత్తిరాజేరు: భోపాలరాజపురంలో కూలిన విద్యుత్ స్తంభం

క్లుప్తంగా

నిత్యావసర సరుకుల పంపిణీ


పేదలకు నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్న హెల్పింగ్ హ్యాండ్స్ సభ్యులు

జామి: మండలంలోని విజినిగిరికి చెందిన పేదలకు హెల్పింగ్ హ్యాండ్స్ అసోసియేషన్ సభ్యులు గురువారం నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ ప్రతినిధులు మాట్లాడుతూ.. మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడతామన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు కొవ్వాడ సన్యాసినాయుడు, సెక్రటరీ మిడతాన తాతంనాయుడు, ఆర్గనైజింగ్ సెక్రటరీ కిలారి సూర్యారావు, సభ్యులు స్వరూప్, ఎర్నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

జీఎస్టీ తగ్గింపుపై అవగాహన


భీమసింగిలో సూపర్ జీఎస్టీపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

జామి: మండలంలోని భీమసింగి రైతుసేవా కేంద్రంలో సూపర్ జీఎస్టీ – సూపర్ సేవింగ్స్‌పై ఇన్‌చార్జ్ ఎంపీడీఓ నరసింహం, మండల వ్యవసాయాధికారి పూర్ణిమ రైతులకు శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎరువులు, ట్రాక్టర్లు, విడిభాగాలు, యంత్ర పరికరాలపై జీఎస్టీ తగ్గిందన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ జె. వెంకటలక్ష్మి, గ్రామపెద్దలు డి.పైడిరాజు, ఏఈఓ, వీఏఏలు, తదితరులు పాల్గొన్నారు.

సత్కారం


ఉద్యోగాలు సాధించిన వారిని సత్కరిస్తున్న లెర్నర్ హబ్ ప్రతినిధులు

చీపురుపల్లి: పట్టణానికి చెందిన లెర్నర్ హబ్‌లో శిక్షణ పొంది ఇటీవల డీఎస్సీలో అర్హత సాధించిన వారికి ఆ సంస్థ నేతృత్వంలో ఘనంగా సత్కరించారు. గురువారం స్థానిక లెర్నర్ హబ్ సంస్థలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో డీఎస్సీ 2025లో ఉపాధ్యాయ పోస్టులు సాధించిన ఆర్.సాయిరాం, వై.గణేశ్, కె.ఝాన్సీరామ్, మౌనిక, ఆర్.సత్యవతి, భాగ్యశ్రీలను ఘనంగా సన్మానించారు. లెర్నర్ హబ్ నుంచి ఒకేసారి ఆరుగురు అభ్యర్థులు ఉపాధ్యాయులు కావడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో లెర్నర్ హబ్ డైరెక్టర్ వై.మహేష్, సిబ్బంది యతీష్, కిరణ్, రాజేశ్వరి, వై.శ్రీనివాసరావు, గోపీకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న దీపాలంకరణ


మందిరంలో దీపాల వెలుగులు

వేపాడ: మండలంలోని వల్లంపూడిలో షిర్డీ సాయిబాబా మందిరంలో సాయి మహిళా సంఘ సభ్యులు నిర్వహించిన దీపాలంకరణ పలువురిని ఆకట్టుకుంది. దసరా సందర్భంగా గురువారం రాత్రి మందిరంలో స్వస్తిక్, ఓంకారం, తదితర ఆకారాల్లో దీపాలు వెలిగించారు.

రోడ్లు జలమయం


మెంటాడ జంక్షన్ రోడ్డులో నిలిచిన వర్షపు నీరు

గజపతినగరం: రెండు రోజులుగా కురిసిన వర్షాలకు రోడ్లన్నీ జలమయమయ్యాయి. గజపతినగరం నాలుగు రోడ్ల కూడలి, మెంటాడ జంక్షన్ రోడ్డులో కాలువలు లేకపోవడంతో వర్షపునీరు రోడ్డుపైనే నిలిచిపోవడంతో ప్రయాణికులు ఇబ్బంది పడ్డారు. అలాగే ప్రభుత్వ డిగ్రీ కళాశాల, పాత మండల పరిషత్ కార్యాలయం వద్ద నీరు నిలిచిపోయింది.

కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలు


రిలే నిరాహార దీక్షలో పాల్గొన్న నిర్వాసితులు

శృంగవరపుకోట: జిందాల్ కంపెనీ తీసుకున్న భూములను తిరిగి రైతులకు ఇవ్వాలని కోరుతూ జిందాల్ నిర్వాసితులు చేస్తున్న రిలే నిరాహార దీక్షలు కొనసాగుతున్నాయి. శుక్రవారం కూడా యథావిధిగా నిర్వాసితులు ఎమ్మెల్సీ రఘురాజు నివాసం వద్ద నిరాహార దీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా రైతుసంఘ నేత చల్లా జగన్ మాట్లాడుతూ.. నక్కపల్లి బల్క్‌డ్రగ్ నిర్వాసితులకు హోం మంత్రి అనిత మద్దతుగా నిలుస్తుంటే.. ఇక్కడ మాత్రం జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవడం సిగ్గుచేటన్నారు.

పోటీల్లో రాణించి జిల్లాకు పేరు తీసుకురావాలి


క్రీడాకారులకు టీషర్టు పంపిణీ చేస్తున్న కోచ్, తదితరులు

- టెన్నీ కాయిట్ కోచ్ రామారావు

చీపురుపల్లి: జాతీయ స్థాయిలో జరగనున్న టెన్నీ కాయిట్ పోటీల్లో పాల్గొని చక్కని ప్రతిభ కనబరిచి రాష్ట్రానికి, జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని టెన్నీకాయిట్ కోచ్ ఎం.రామారావు ఆకాంక్షించారు. జాతీయ స్థాయిలో జరగనున్న టెన్నీకాయిట్ పోటీలకు రాష్ట్రం తరఫున ఎంపికైన ఆరుగురు క్రీడాకారులకు మండంలోని పెదనడిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో కోచ్ రామారావు ఆధ్వర్యంలో సెప్టెంబర్ 20 నుంచి శిక్షణ ఇస్తున్నారు. వీరంతా అక్టోబర్ 8 నుంచి 12 వరకు ఉత్తరప్రదేశ్‌లోని నోయిడాలో జరగనున్న జాతీయ స్థాయి టెన్నీకాయిట్ పోటీల్లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తరఫున పాల్గొంటారు. అయితే ఇక్కడ శిక్షణ పొందుతున్న రాష్ట్ర స్థాయి టెన్నీ కాయిట్ క్రీడాకారులు ఆర్.మౌనిక (విజయనగరం), జి.హేమమాధురి(పశ్చిమ గోదావరి), జి.శ్రావణి (విజయనగరం), జి.సుప్రియ (అనంతపురం), కె.ఇందు(విజయనగరం), ఎస్.ప్రసన్న(విజయనగరం), పి.రేణుక, ఎస్.రాహుల్(విజయనగరం)లకు శుక్రవారం టీ షర్టులు, షూస్ అందజేశారు. ఈ సందర్భంగా కోచ్ రామారావు మాట్లాడుతూ.. ఇక్కడ శిక్షణ పొందుతున్న క్రీడాకారులకు 15 రోజులుగా వసతి సౌకర్యాలతో పాటు టీ షర్టులు, బూట్లను నెలిమర్ల మండలంలోని అలుగోలు గ్రామానికి చెందిన మత్స రామప్పుడు జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు ఎం.భోజీచక్రపాణి, ఎం.వీరాదాసు, కె.అప్పలనాయుడు ఏర్పాటు చేసినట్లు చెప్పారు.

బాధితులకు అండగా డిజిటల్ బుక్


డిజిటల్ బుక్ క్యూ ఆర్ కోడ్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

చీపురుపల్లిరూరల్ (గరివిడి): వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి తీసుకువచ్చిన డిజిటల్‌బుక్ బాధితులకు అండగా నిలుస్తుందని వైఎస్సార్‌సీపీ మండల నాయకులు అన్నారు. గరివిడి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో గ్రామాల్లో ఏర్పాటు చేయనున్న గ్రామ కమిటీలు, అనుబంధ గ్రామ కమిటీల అంశంపై మండల స్థాయి, నాయకులు, కార్యకర్తలతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డిజిటల్ బుక్‌కు సంబంధించిన క్యూఆర్ కోడ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రజా సంక్షేమ పాలనను పక్కన పెట్టి.. కక్షపూరితంగా వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలను వేధిస్తోందన్నారు. పదహారు నెలల కాలంలో కూటమి ప్రభుత్వం పాలనలో పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తున్నారని మండిపడ్డారు. గ్రామాల్లో వైఎస్సార్‌సీపీకి అనుబంధంగా గ్రామ కమిటీలు ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు మీసాల విశ్వేశ్వరరావు, జెడ్పీటీసీ సభ్యుడు వాకాడ శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీ గుడివాడ శ్రీరాములు నాయుడు, రాష్ట్ర పంచాయతీరాజ్ వింగ్ జాయింట్ సెక్రటరీ లెంక శ్రీరాములు, సర్పంచ్, ఎంపీటీసీ సభ్యులు పొన్నాడ కుమార్, కడుమల రాంబాబు, బమ్మిడి కార్తీక్, మండల బూత్ కమిటీ ప్రెసిడెంట్ శివుకు కాంతారావు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గాంధీజీ జయంతి


వేపాడ: జగ్గయ్యపేటలో గాంధీ విగ్రహానికి పూలమాల వేస్తున్న యూత్ సభ్యులు



బొండపల్లి: నెలివాడలో గాంధీజీ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న సర్పంచ్ కీర్తి, తదితరులు


గజపతినగరం: మండల కేంద్రంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో గాంధీ చిత్రపటానికి పూలమాల వేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు గార తవుడు, బూడి వెంకటరావు, తదితరులు

జాతిపిత మహాత్మా గాంధీ జయంతి గురువారం వాడవాడలా ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్వాతంత్ర్య సమరంలో ఆయన చేసిన పోరాటాన్ని వక్తలు వివరించారు. అహింసా, శాంతి మార్గాల్లో నేటి యువత నడవాలని పిలుపునిచ్చారు.
– వేపాడ/బొండపల్లి/గజపతినగరం

మందుగుండు విక్రయిస్తే చర్యలు

చీపురుపల్లి: దీపావళి పండగను పురస్కరించుకుని అనుమతుల్లేకుండా ఎవరైనా మందుగుండు తయారు చేసినా, విక్రయించినా చట్టపరమైన చర్యలు తప్పవని సీఐ జి.శంకరరావు శుక్రవారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. దీపావళి పండుగ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు తెలిపారు. చీపురుపల్లి మండలంలోని పెదనడిపల్లి, గుర్ల మండలంలోని పకీరుకిట్టలి గ్రామాల్లో మాత్రమే అనుమతులు పొందిన బాణసంచా తయారీ కేంద్రాలున్నట్లు చెప్పారు. ఆ కేంద్రాల వద్ద సైతం ఎలాంటి ప్రమాదాలు జరగకుండా నిబంధనలు ప్రకారం తగిన జాగ్రత్తలు పాటించాలని సూచించారు.

సమస్యలు పరిష్కరిస్తాం

- తహసీల్దార్ శ్రీనివాసరావు



గ్రామసభలో మాట్లాడుతున్న తహసీల్దార్ శ్రీనివాసరావు

శృంగవరపుకోట: రైతాంగ సమస్యల పరిష్కారం కోసమే రీ సర్వే చేస్తున్నామని మండల తహసీల్దార్ డి.శ్రీనివాసరావు అన్నారు. మూలబొడ్డవర గ్రామ సచివాలయంలో సర్పంచ్ దేవాపురపు మీనా నేతృత్వంలో శుక్రవారం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో నెలకొన్న రెవెన్యూ సమస్యలను పరిష్కరించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం రీసర్వే చేయిస్తోందన్నారు. కార్యక్రమానికి ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు, ఎంపీపీ సోమేశ్వరరావు, తదితరులు హాజరయ్యారు.

ఆదాయ వనరుల పెంపుపై అవగాహన

వేపాడ: పంచాయతీల్లో ఆదాయ వనరులు పెంచుకోవడానికి గాను సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు రెండు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని శుక్రవారం ప్రారంభించారు. ఎంపీడీఓ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ సూర్యనారాయణ మాట్లాడుతూ.. గ్రామాల్లోని ఖాళీ స్థలాల్లో కొబ్బరి చెట్లు పెంచాలన్నారు. అలాగే మార్కెట్ వేలం, భూమి పన్ను, వినోదం పన్ను, ప్రకటనల పన్ను పక్కాగా వసూలు చేసి ఆదాయం పెంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీఓ రవికుమార్, ఏఓ మహేష్, సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, డిజిటల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

పరిశీలన


మెయిన్ రోడ్డును పరిశీలిస్తున్న ఎంపీడీఓ సూర్యనారాయణ, తదితరులు

వేపాడ: మండల కేంద్రంలోని ప్రధాన రహదారిలో పడిన గుంతల్లో వర్షపునీరు నిలిచిపోవడంతో పాటు లీకైన తాగునీటి పైప్‌లైన్లను ఎంపీడీఓ సూర్యనారాయణ, తదితరులు శుక్రవారం పరిశీలించారు. తక్షణమే రోడ్డుపై నిలిచిన నీరు తొలగించడంతో పాటు పైప్‌లైన్లకు మరమ్మతులు చేపట్టాలని పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావును ఆదేశించారు. కాలువల్లో పూడిక తీత పనులు చేపట్టాలని సర్పంచ్‌కు సూచించారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ దేవీ, సీహెచ్‌ఓ ఆంజనేయులు, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు, వార్డు మెంబర్ మిరపాక రమణ, ఎంసీఓ రాంబాబు పాల్గొన్నారు.

చంద్రబాబు.. అబద్ధాల్లో నంబర్ వన్


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య

- కూటమి హయాంలో ప్రజా సంక్షేమం గాలికి..
- విద్య, వైద్యం, వ్యవసాయ రంగాలు నిర్వీర్యం
- ప్రజాధనంతో పర్యటనలు, విలాసాలు
- గజపతినగరం నియోజకవర్గానికి ఒక్క హామీ ఇవ్వని సీఎం
- మాజీ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య

గజపతినగరం: భారతదేశంలో మోసాలు చేసి అబద్ధాలు ఆడే నంబర్ వన్ ముఖ్యమంత్రి ఎవరంటే చంద్రబాబునాయుడు పేరు చెప్పక తప్పదని మాజీ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ అన్నారు. శుక్రవారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఇటీవల గజపతినగరం నియోజకవర్గం దత్తిరాజేరు మండలం దత్తి గ్రామంలో నిర్వహించిన ప్రజా వేదిక కార్యక్రమంలో పాల్గొన్న చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి హోదాలో నియోజకవర్గ అభివృద్ధికి ఒక్క హామీ ఇవ్వలేదన్నారు. పైగా పచ్చి అబద్ధాలు మాట్లాడడాన్ని ప్రజలు జీర్ణించుకోలేకపోయారని చెప్పారు. సూపర్ సిక్స్ పథకాలు సూపర్ హిట్‌గా అమలు చేసినట్లు గొప్పలు చెప్పుకున్న బాబు స్త్రీనిధికి సంబంధించి గాని, నిరుద్యోగ భృతి గాని, పీ-4 పథకాల గురించి ఎందుకు మాట్లాడలేదని ప్రశ్నించారు. విజయనగరం జిల్లాలో ప్రభుత్వ మెడికల్ కాలేజీలు, రోడ్లు, భోగాపురం ఎయిర్ పోర్ట్‌కు నిధులు మంజూరు చేసిన ఘనత వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికే దక్కుతుందని చెప్పారు. వైఎస్సార్‌సీపీ హయాంలో అభివృద్ధి జరిగితే.. కూటమి హయాంలో అమరావతి పేరిట లక్షల కోట్ల రూపాయలు అప్పులు చేస్తున్నారన్నారు. ప్రభుత్వ వైద్య కళాశాలలతో పాటు విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను కూడా ప్రైవేటీకరణ చేసేందుకు చంద్రబాబు సిద్ధపడడం దుర్మార్గమన్నారు. మొదట నుంచీ లిక్కర్ స్కామ్‌లు చేసింది చంద్రబాబేనని ఆరోపించారు.

నీరుగారిన ప్రజల ఆశలు

- మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య

ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నియోజకవర్గానికి ఏదో చేస్తారని ఆశపడిన ప్రజలు ముఖ్యమంత్రి తీరుతో నీరుగారిపోయారని మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య అన్నారు. వైఎస్సార్‌సీపీ హయాంలో వలంటీర్లు పింఛన్లు పంపిణీ చేస్తే.. ప్రస్తుతం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పింఛన్లు పంపిణీ చేస్తున్నారని, ఇదేనా అభివృద్ధి అని ప్రశ్నించారు. గత వైఎస్సార్‌సీపీ హయాంలో సుమారు 66 లక్షల మందికి పింఛన్లు పంపిణీ చేస్తే.. కూటమి ప్రభుత్వం హయాంలో ఆ సంఖ్య 60 లక్షలకు పడిపోయిందన్నారు. 16 నెలల కాలంలో కొత్తగా ఒక్క పింఛన్ కూడా ఇవ్వలేదని ఎద్దేవా చేశారు. భీమసింగి సుగర్ ఫ్యాక్టరీని తెరిపిస్తామని గతంలో చంద్రబాబు, లోకేష్ హామీ ఇచ్చారని.. కాని ఇంతవరకు ఆ హామీ నెరవేర్చలేకపోయారని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బూడి వెంకటరావు, ఏఎంసీ మాజీ చైర్మన్ వి.ముత్యాలనాయుడు, తుమికాపల్లి, మధుపాడ సర్పంచ్‌లు బెల్లాన త్రినాథరావు, కె.పైడిపునాయుడు, సీనియర్ నేతలు కరణం ఆదినారాయణ, మండల సురేష్, తిరుపతి, రామునాయుడు, తదితరులు పాల్గొన్నారు.

దళితులకు అన్యాయం

చీపురుపల్లి: కూటమి ప్రభుత్వంలో దళితులకు అన్యాయం జరుగుతోందని జిల్లా సామాజిక న్యాయ ఉద్యమ వేదిక కన్వీనర్ గంటాన అప్పారావు గురువారం ఒక ప్రకటనలో ఆరోపించారు. కూటమి ప్రభుత్వం కేటాయిస్తున్న నామినేటెడ్ పదవుల్లో దళితులకు సముచిత స్థానం దక్కడం లేదని పేర్కొన్నారు. దీనికి చీపురుపల్లి ప్రజల ఇలవేల్పు కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయ కమిటీ ఏర్పాటే నిదర్శనమన్నారు. పట్టణానికి చెందిన దళిత సామాజిక వర్గం అద్దూరి వంశీయులకు చెందిన కనక మహాలక్ష్మి ఆలయం తర్వాత కాలంలో దేవదాయ శాఖ పరిధిలోకి వెళ్లిందన్నారు. అప్పటినుంచి ఇంతవరకు ఒక్కసారి కూడా అద్దూరి వంశీయులకు ఆలయ కమిటీలో చోటు దక్కకపోవడం దారుణమని తెలిపారు.